


నటేశ్వరరావు పుట్టుకతోనే నటుడు. చిన్నతనంనుంచీ అతను తన నటనాకౌశలం ప్రదర్శిస్తూ వొచ్చాడు. క్లాసులు ఎగ్గొట్టటానికి చెప్పే అబద్ధపు సాకులు సమర్థించుకోటానికి చేసే భావ ప్రదర్శనతో అతని నటన ప్రారంభమైంది. నాయనమ్మ చనిపోవటంవల్ల దుఃఖం; తలనొప్పీ, కడుపునొప్పీ ఇత్యాదులవల్ల కలిగే బాధా; మాస్టర్లపైనా, వాళ్ళ ఈకబెత్తాలపైనా భయభక్తులూ ఎంతో సహజంగా అభినయించి ఫలితం అందుకునేవాడు. వయస్సుతోపాటు ఊహ పెరిగినకొద్దీ అతను తన నటనాశక్తిని అన్ని విధాలా పూర్తిగా ఉపయోగించుకోటం ప్రారంభించాడు. డబ్బు లేకుండా కాఫీహోటలుకు వెళ్లి సర్వరు నోరు తెరుచుకునేలా తిని, బిల్లు అయ్యర్ టేబిల్ మీద పెట్టి, దర్జాగా జేబులో చెయ్యి పెట్టి, ఒక్కసారిగా తెల్లమొహం వేసేవాడు, పర్సు పోయినట్టు అప్పుడే తెలుసుకున్నవాడిలా. అయ్యర్‌కి ఇటువంటి వ్యవహారాలు మామూలే అయినా, నటేశ్వరరావు ముఖంలోని ఆందోళనా, భయమూ, అతని పెద్దమనిషి తరహా ప్రవర్తనా చూసి టోపీలో పడకతప్పేది కాదు. ఇలా అమాయకంగా ముఖం పెట్టీ, జాలిచూపులు చూసీ, అవసరమైతే గంభీరంగా, నిశ్చలంగా తొణకని చూపులు చూసీ చేసిన తప్పులకి అనుభవించాలిసిన శిక్ష లెన్నో తప్పించుకున్నాడు. అతని వదనం ఎలాటి భావప్రదర్శనకైనా అనుగుణమే. అతని ప్రయత్నం లేకుండానే ముఖకవళికలు అతని భావాల కనుగుణంగా మారతాయేమో ననిపిస్తుంది.

రంగస్థలం మీదకి రాకముందే నటనలో ఎంతో అనుభవం సంపాదించిన నటేశ్వరరావు రంగంమీద అద్భుతంగా ప్రకాశించగలగటంలో ఆశ్చర్యమేముంది? అతను కాలేజీలో చదివినన్నాళ్లూ కాలేజి నాటకరంగం ప్రభ వెలిగింది. తర్వాత అమెచ్యూర్ ఆర్టిస్ట్‌గా, ఆతర్వాత కంట్రాక్టు నాటకాల్లో నటించీ అశేషమైన కీర్తి సంపాదించుకున్నాడు. నటేశ్వరరావు విజయానికి కారణం అతను నటిస్తున్నంతసేపూ అది నటన అనుకోడు. గిరీశంగా ఎంతబాగా నటిస్తాడో హరిశ్చంద్రుడుగాకూడా అంతబాగా రాణిస్తాడు.

నిస్సందేహంగా నటేశ్వరరావు గొప్పనటుడే. ఇందుకు అతని పరిచితులమైన మేమెంతో గర్విస్తాము. కాని దురదృష్టవశాత్తూ నటేశ్వరరావు నటనే తన ఆదర్శంగా పెట్టుకున్నాడు. రంగంమీదేకాక జీవితంలోకూడా నటుడిగానే జీవించ దలచుకున్నాడు. నటేశ్వరరావునుంచి నటనని విడదీయలేము. ఇది చాలావరకూ అతని పతనానికి కారణమైంది. నటకుడిగా నటేశ్వరరావు ఎంత గొప్పవాడో నైతికంగా అతనంత పతితుడు.

పాత్రలో లీనంకావటం నటేశ్వరరావుకి గొప్పతనంతోపాటు చిక్కుల్నికూడా తెచ్చిపెట్టింది. స్నేహితుల్ని అప్పు అడిగితే అది నిజంగా అవసరమై అడుగుతున్నాడో లేక

జల్సాకో తెలియక వాళ్లు లేదనటం, అతను డబ్బు పుట్టక నానాఅవస్థలూ పడటం కొత్త కాదు. అబద్ధం చెప్పినా నిజం చెప్పినా భావ ప్రకటనమాత్రం ఒకేవిధంగా నమ్మించేదిగా ఉండటంవల్లా, అతని ప్రవర్తన అందరికీ తెలిసిందే కావటంవల్లా మాలో ఎవరికీ అతనంటే జాలి పుట్టేదికాదు.

కాలేజీలో చదువుతున్న రోజుల్లో నటేశ్వరరావుకి విద్యార్థులలో గల పలుకుబడీ, అతని సుందర విగ్రహం, నటనా చాతుర్యం విద్యార్థినుల కటాక్ష వీక్షణాలను ఆకర్షించాయి. నాటకరంగంమీద అతనిపక్క నటించటానికి కుతూహలం చూపేవాళ్లు కొంతమంది విద్యార్థినులు. ఓసారి కాలేజీ నాటకమండలి లైలా-మజూను నాటకం ప్రదర్శించింది. ఖైస్ (మజూను)గా నటేశ్వరరావు, లైలాగా అతన్ని అభిమానించే ఓవిద్యార్థినీ వేషాలు ధరించారు. నాటకం సాగుతున్నకొద్దీ నటేశ్వరరావు పాత్రలో లీనమై పోతూవచ్చాడు. ప్రణయం ప్రదర్శించే ఘట్టం వొచ్చింది. లైలా అంది: 'ఖైస్, నీ జీవితాశయం ఏమిటి?'' నటేశ్వరరావు లైలా పాత్రవైపు ప్రణయం ఉట్టిపడేలా చూశాడు. "లైలా, నీలో ఐక్యంకావటమే నా జీవితాశయం.". ఈ మాటలు నటేశ్వరరావు హృదయం లోంచి వొచ్చాయి. నటేశ్వరరావు ఇప్పుడు పాత్రలో పూర్తిగా లీనమై పోయాడు. ఇప్పుడతను ఖైస్. ఖైస్ లో ప్రణయమంతా అతనిలో కరడు కట్టింది. అతని కళ్లముందున్నది లైలా కాని నటిస్తున్న విద్యార్థిని కాదు. యంత్రంలా మాటలు అప్పచెప్పటం అతని తలకు మించిన పని. "నీలో ఐక్యం కావటమే నా జీవితాశయం, లైలా'' అంటూ నటేశ్వరరావు లైలా పాత్ర ధరించిన విద్యార్థినిని గాఢంగా హృదయానికి అదుముకున్నాడు. వెంటనే ఈలలు, కేకలు, బల్లల చప్పుళ్లూ చెలరేగాయి. లైలా పాత్ర వేసిన అమ్మాయి లోపల సంతోషించినా ఈ అల్లరి చూసి బెదిరిపోయింది. మానరక్షణకోసం తర్వాత ప్రిన్సిపాలుతో రిపోర్టు కూడా చేసింది. వారం రోజులపాటు సస్పెండు అయాడు నటేశ్వరరావు. ఈ పని దురుద్దేశంతో ఎంతమాత్రం చేయలేదనీ, తనకి నటిస్తున్నప్పుడు లోకమర్యాదలు జ్ఞాపకం ఉండవనీ అవసరమైతే క్షమాపణ కూడా చెప్పుకోటానికి తన కభ్యంతరం లేదనీ నటేశ్వరరావు అంటే మాత్రం ఎవరు నమ్మగలరు? ఈ ఘటనవల్ల నటేశ్వరరావుకి ఇంకో అపకారం జరిగింది. అతను మరోవిద్యార్థినితో ప్రణయకలాపం సాగించాడు. ఆమె నాటకం చూసి నటేశ్వరరావుని అపార్థం చేసుకుంది. "నువ్వు నటుడివి, నీతో నాకేమీ సంబంధం లేదు. లైలాదగ్గరే నీ ప్రణయం ప్రదర్శించుకోవొచ్చు." అని ఖండితంగా అనేసింది. పాపం, నటేశ్వరరావు ఆమెకి అర్థమయేలా చెప్పటానికి ప్రయత్నించాడు కాని ఫలించ లేదు.

పాత్రలో లీనం కావటం వల్ల ఇలాంటి ఘటన లెన్నో నటేశ్వరరావు జీవితంలో జరిగాయి. అయితే తన చాతుర్యం వల్ల అతనికి కలిగిన లాభాలు కూడా తక్కువంటానికి వీల్లేదు. ఒక్కొక్కసారి ఆలోచిస్తుంటే జీవితంలో నటించటం నటేశ్వరరావుకి అతని ప్రయత్నం లేకుండానే జరుగుతుందేమో ననిపిస్తుంది. బహుశా దీనికి కారణం నటనలో అతనికి పుట్టుకనుంచీ ఉన్న ప్రావీణ్యమే కావొచ్చు.

నాటకాలతో విసుగుపుట్టి నటేశ్వరరావు ప్రభుత్వోద్యోగంలో చేరాడు. డబ్బుకోసం బాధపడినవాడు కావటంచేత అతని కెలాగైనా బాగా సంపాదించాలని ఉంది. లంచాలు జోరుగా పట్టాడు. నటేశ్వరరావు వంటివాడికి విరోధు లుండటం గొప్పసంగతి కాదు. అతను లంచాలు తీసుకోటం, అతనిమీ దెలాగైనా ఓ దెబ్బ తీయాలని సంకల్పించుకున్న విరోధులకి మంచి అవకాశం కలిగించింది. నటేశ్వరరావుని అవమానం చేయటానికి వాళ్లు ఓ వింత పద్ధతి అవలంబించారు. అతనిని లంచాలు తీసుకోని ప్రభుత్వ సేవకుడుగా భావిస్తున్నామనీ, అంచేత అతనికి ఓ పెద్ద సన్మాన సభ ఏర్పాటుచేసి గౌరవించటం లంచగొండితనం నిర్మూలనకి ఎంతో ఆవశ్యకమనీ, సభకు తప్పక దయచేయవలసిందనీ ఆహ్వానం పంపేరు. నటేశ్వరరావు నిజంగా మోసపోయాడు. సన్మానసభలో లంచగొండితనంమీద అనర్గళంగా ఉపన్యసించాడు. "లంచం తీసుకోవటం అధమాధమం. దీన్ని,

ప్రజలందరూ కలిసి అరికట్టాలి. సాంఘికంగానే గాక వ్యక్తిగతంగాకూడా లంచం విసర్జనీయం. లంచం అంగీకరించట మంటే మనిషికిగల ఉదాత్తమయిన ఆత్మని చంపుకోటమే. సాంఘికంగా దీనివల్ల కలిగే నష్టాలు, బాధలూ అందరికీ తెలిసినవే. ప్రతి ఒక్కడూ లంచగొండితనాన్ని అరికట్టటానికి ఇలా పూనుకొంటేగాని"— సాగించాడు ధోరణి తమపథకం ప్రకారం సభలో చేరిన అతని విరోధులు కేకలు ప్రారంభించారు- "మొదటిరకం లంచగొండి నటేశ్వరరావే" అని. కాని వాళ్ల పథకం పారలేదు. ప్రజల్లో అలజడి ప్రారంభమైంది. నటేశ్వరరావు తొణకకుండా బ్రహ్మాండంగా ఉపన్యసిస్తున్నాడు. ఇప్పు డతని పాత్ర లంచగొండితన నిర్మూలన ప్రచారకుడు. పాత్రలో లీనమైపోయాడు సభికుల మనస్సులు చూరగొన్నాడు. విరోధులు కేకలు వేస్తూనే ఉన్నారు. "ఎవ్వరైనా ఆ కేకలు - మర్యాదగా కూర్చుంటారా? మక్కెలు విరగ తన్నాలా?- గిట్టకపోతే నోర్లు ముయ్యండి-" ప్రజలు గర్జించారు ఇంతమంది ప్రజల్ని పిలిచినందుకు నటేశ్వరరావు విరోధులు తమని తామే నిందించుకున్నారు.

నటేశ్వరరావు మాటలలో అతని జీవిత రహస్యం ఇది: "ఈ ప్రపంచం ఓ పెద్ద నాటకం. అందులో నేను కేరక్టర్ యాక్టర్ని. ఏ పాత్ర అయినా సరే, అందులో లీనం కావటం నాలో విశేషం జీవితంలో నా జయాపజయాలకి కూడా కారణం అదే."

# ఆంగ్లసాహిత్యం : 'బ్రాంటీ సిస్టర్స్'

మాలతీ చందూర్

పందొమ్మిదవ శతాబ్దంలో స్త్రీ రచయితలూ, చిత్రకారిణులూ చాలా అరుదుగా వుండేవారు. ఎక్కడైనా స్త్రీ తనమనసులోని అభిప్రాయాల్ని నవలా రూపంలో రచించినా తన పేరుకు బదులుగా పురుషుని పేరుపెట్టి ప్రచురించేది. ధైర్యంగల స్త్రీ ఎవ్వరైనా తనపేరుతో ప్రకటించినా "స్త్రీలు నవలలు రాయడమా" అని చులకన చేస్తూండేవారు నాటి రచయితలు. స్త్రీ వ్యర్థురాలనీ, అబలనీ, సాహిత్య సేవకి పనికి రాదనీ అనుకునే రోజుల్లో ఒకే తల్లి కడుపున జన్మించిన చార్లెటీ. ఎమిలీలు ఉత్కృష్ట గ్రంథాలు రచించి సాహిత్యలోకంలో చిరస్మరణీయులయారు. ఎమిలీఛార్లెటీలు సారస్వతంలో తుల్లా ప్రకాశించారు. "ఎకో పల్లెపట్టున, ఏ అవకాశాలూ లేనిచోట నిరాడంబర జీవితం గడుపుతున్న ఈ స్త్రీల హృదయంలో అంతకావ్య సౌందర్యం ఏమూల దాగుందో"- అని థేకరే వంటి విద్వాంసుడు తెల్లబోయాడు.

ఎమిలీ నిశ్శబ్దాన్ని, ఏకాంతాన్ని కోరేది. సంతోషంఆమె స్వభావంలో లేదు. ఎప్పుడూ చెప్పరాని అశాంతి ఆమె గుండెల్నిపిండేది. హృదయభారం దిగమింగి నిత్యకృత్యాల్ని చేసుకునేది ఎమిలీ. ఇహలోక జీవితంలోని అసంపూర్ణత అడుగడుక్కీ ఆమెని కలచివేసేది. మబ్బుల వెనకనుంచి ఏదో పిలుపు అనుక్షణం ఆమె చెవులకి ప్రళయగీతికవలె వినపడేది! ఆ పిలుపులో కర్కశత్వమేగాని మార్దవం వుండేది కాదు. అది విధాతపన్నిన వుచ్చు! ఆ పిలుపునే 'వదరింగ్ హైట్స్' (Wuthering Heights) లో క్రూరపురాతుగా చిత్రిస్తుంది.

ఛార్లెటీ, ఎమిలీ అంత నిరాశావాది కాదు. ఆమె జీవితంలోకూడా నిస్పృహ లేకపోలేదు. కాని నైరాశ్యాన్ని వాస్తవిక దృష్టితో పాఠకులకి ప్రదర్శిస్తుంది. ఆమె రచించిన 'జేన్ ఐర్' నవలని మనం మర్చిపోలేము ఆ 'జేన్ ఐర్' తో కూడా అనాథాశ్రమంలో మనం చదువుకుంటాం. ఆమె బాధలు మనం పంచుకుంటాం. జమీందారయిన రాఛెస్టర్ యింట్లో ఆమె వుపాధ్యాయినిగా కుదురుతుంది. ఆఖరికి కుంటివాడై, కళ్లు రెండూ పోయి, ధనసంపత్తి నంతా పోగొట్టుకున్న రాఛెస్టరునే జేన్ పెళ్ళాడటం మన భారతీయ దృక్పథానికి బాగా నచ్చుతుంది.